ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

సోమవారం 9 జూన్ 2025



పీలేరులో సీఐకు ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు లక్ష్మీకాంతమ్మ, తదితరులు

రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

● రూ.11.7 కోట్లతో రింగు రోడ్డు అభివృద్ధి : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మంత్రి మండిపల్లి రాయచోటి పట్టణ పరిధిలోని రాయచోటి-వేంపల్లె రోడ్డు (ఎన్‌హెచ్-440) రింగు రోడ్డు నుంచి కడప-రాయచోటి రోడ్డు (ఎన్‌హెచ్-40) రింగు రోడ్డు వరకు రెండు వరుసల లింకు రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా రాయచోటి పట్టణ పరిధిలోని రాయచోటి-వేంపల్లి రోడ్డు (ఎన్‌హెచ్-440), కడప- రాయచోటి రోడ్డు (ఎన్‌హెచ్-40) వరకు రెండు వరుసల లింకు రోడ్డును రూ.11.07 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కృషితో రాబోయే రోజుల్లో నియోజకవర్గ పరిధిలోని రోడ్లన్నీ మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గువ్వలచెరువు ఘాట్‌లో టన్నెల్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించి గువ్వలచెరువు ఘాట్ రోడ్డు సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

మహిళల ఆగ్రహం

'వేశ్యల రాజధాని అమరావతి' అంటూ సాక్షి మీడియా డిబేట్‌లో చేసిన వ్యాఖ్యలపై తెలుగు మహిళలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం జిల్లాలో మహిళల నుంచి తీవ్ర ఆగ్రవేశాలు వ్యక్తమయ్యాయి. మహిళా లోకాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్‌రావులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు పోలీసుస్టేషన్లలో వారిపై ఫిర్యాదులు చేశారు.

● మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన
● పలు స్టేషన్లలో కొమ్మినేని, కృష్ణంరాజులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు

పీలేరు/రాజంపేట టౌన్/మదనపల్లె టౌన్/బి.కొత్తకోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతితో పాటు అక్కడున్న మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీలేరులోని తెలుగు మహిళలు ఆదివారం పీలేరు అర్బన్ సీఐ యుగంధర్‌కు ఫిర్యాదు చేశారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు, మరో జర్నలిస్టు కృష్ణంరాజుపై పీలేరు మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు పురం రెడ్డమ్మ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రెడ్డమ్మ మాట్లాడుతూ సాక్షి టీవీలో జరిగిన డిబేట్‌లో కృష్ణంరాజు అమరావతి మహిళలను కించపరచడం, దానికి కొమ్మినేని శ్రీనివాసరావు వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మాభిమానం, భవిష్యత్తుతో ముడిపడిన రాజధాని అంశంలో అసభ్యకరంగా వ్యాఖ్యలు చేయడం హేయకరమన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో మరెవరూ మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయకుండా కట్టడి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీలేరు ఏఎంసీ డైరెక్టర్లు లక్ష్మీకాంతమ్మ, రమాదేవి, షమ, వనిత, నాయకురాళ్లు చంద్రలేఖ, చంద్రకళ, ప్రభావతి, వనజ, మీనా, చంద్రమ్మ, అనూరాధ, శారదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో...

అమరావతి రాజధాని కోసం మంగళగిరి మహిళలు చేసిన త్యాగాలపై సాక్షి మీడియా న్యూస్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు, జర్నలిస్టు కృష్ణంరాజులపై ఆదివారం రాజంపేటలోని మన్నూరు పోలీసుస్టేషన్లలో మహిళా విభాగ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి అమరావతి రాజధాని వైసీపీ ప్రభుత్వ హయాంలో కుంటుపడేలా చేశారని వారు ఆరోపించారు. 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్ ముడిపడిన రాజధానిపై కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని రాజధాని మహిళలపైన అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారంటూ రాజంపేట పట్టణ స్టేషన్‌లో సీఐ రాజాకు ఫిర్యాదు చేశారు. అలాగే మన్నూరు పోలీసుస్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. వ్యాఖ్యలు చేసిన సాక్షి మీడియా వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షురాలు వాణి, ఎంపీటీసీ ఖాదర్‌బీ, మహిళా నేతలు అనిత, సుభద్ర, సరోజమ్మ, పట్టణ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య, కొల్లి రెడ్డయ్య, బాపనయ్యనాయుడు, పాండు రాజు, కేశవ, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో...

రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలను వేశ్యలంటూ అగౌరవ పర్చిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై కేసులు నమోదు చేయాలంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమరావతి అభివృద్ధి కోసం చర్యలు చేపడుతుంటే చూసి ఓర్వలేక జగన్‌రెడ్డి ఇలాంటి నీతిమాలిన మాటలు మాట్లాడిస్తున్నారని పర్వీన్‌తాజ్ ఆరోపించారు. తక్షణం జగన్‌రెడ్డి అమరావతి మహిళలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఫిర్యాదుల మేరకే కాకున్నా పోలీసులు సుమోటోగా స్వీకరించి ఆ ఇద్దరిపై కేసు నమోదు చేయాలని ఆమె పోలీసులను కోరారు. ఆమె వెంట చావిడి కిట్టన్న, ప్రభాకర్, మస్తాన్‌హరి, మస్తాన్‌రెడ్డి, విజయకుమారి, ముస్కాన్, షాహినా, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో...

రాష్ట్ర రాజధాని అమరావతిలోని మహిళను వేశ్యలంటూ కించపరచిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుపై పోలీసులు కేసు నమోదు చేయాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్‌లో రైటర్‌కు ఫిర్యాదు చేసిన వెంకటేశ్ మాట్లాడుతూ....రాజధాని కోసం 35 వేల ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించిన మహిళల్లో ఎక్కువ శాతం దళితులు వున్నారన్నారు. అటువంటి వారిని నీలి చానెల్లో వేశ్యలంటూ సంబోధించడం, దీన్ని ఆ చానెల్ ప్రసారం చేయడం దారుణమన్నారు. మహిళలను కించపరిచిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సుద్దిళ్ల సుధాకర్, మధుబాబు, బాలాజి, రెడ్డిప్రసాద్, మల్లికార్జున పాల్గొన్నారు.



బి.కొత్తకోటలో మహిళలతో కలిసి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేస్తున్న పర్వీన్‌తాజ్



మదనపల్లెలో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు ఆర్‌జే వెంకటేశ్ తదితరులు



రాజంపేటలో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షురాలు వాణి తదితరులు

ఏపీ ఈఏపీ సెట్‌లో 10 మంది

జిల్లా విద్యార్థులకు రాష్ట్ర ర్యాంకులు



మహ్మద్ ముదస్సీర్ (102 ర్యాంకు)

మదనపల్లె టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖ విడుదల చేసిన ఏపీ ఈఏపీ సెట్‌లో అన్నమయ్య జిల్లాకు చెందిన 10 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. వీరిలో మదనపల్లె పట్టణం ఇందిరానగర్‌కు చెందిన మహమ్మద్ ముదస్సీర్ 85.3293 మార్కులతో 102వ ర్యాంకు, గాలివీడు మండలం అరవీటివాండ్లపల్లెకు చెందిన వి.శ్రీకాంత్‌రెడ్డి 85.1874 మార్కులతో 106వ ర్యాంకు, రాయచోటికి చెందిన ఎం.రెడ్డి వెంకట గణేశ్ 84.2879 మార్కులతో 119వ ర్యాంకు, తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లెకు చెందిన బి.అరుణ్ కుమార్‌రెడ్డి 83.7954 మార్కులతో 125వ ర్యాంకు, ఓబులవారిపల్లెకు చెందిన ఎం.తేజేశ్వర్‌రెడ్డి 79.1741 మార్కులతో 277వ ర్యాంకు, రామాపురం మండలం హసనాపురానికి చెందిన అభినవ్ రెడ్డి 78.1707 మార్కులతో 322 ర్యాంకు, ములకలచెరువుకు చెందిన జి.యాషిక రెడ్డి 77.4245 మార్కులతో 349 ర్యాంకు, మదనపల్లె మండలం ఎగువ కురవంకకు చెందిన డి.రిష్యనాథ్‌రెడ్డి 76.8477 మార్కులతో 377వ ర్యాంకు, కురబలకోటకు చెందిన ఎం.వేద హర్షిత్‌రెడ్డి 76.5036 మార్కులతో 403వ ర్యాంకు సాధించారు. రాయచోటి పట్టణం కొత్తపేటకు చెందిన వి.జశ్వంత్ 75.5380 మార్కులతో 455వ ర్యాంకు సాధించారు.

మదనపల్లె వద్ద పశువుల స్లాటర్ హౌస్

● ఏడాదిగా వందల ఎద్దులు, దూడలు హతం
● ఆవు, దూడలను కాపాడిన పోలీసులు



స్లాటర్‌హౌస్ సమీపంలో తవ్విన గోతిలో పశువుల ఎముకలు

మదనపల్లె టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం ఆరోగ్యవరం సమీపంలోని ఎర్రగన్నమిట్ట దిగువన ఓ షెడ్డు నిర్మించి అక్కడ ఎద్దులు వధించి వాటి మాంసం విక్రయించే స్లాటర్ హౌస్ బయట పడింది. ఆదివారం ఓ ఆవును ఈ స్లాటర్ హౌస్ వద్దకు తీసుకెళ్లి వధించనున్నట్లు సమాచారం రావడంతో స్పెషల్ బ్రాంచి పోలీసులు మధ్యాహ్నం 1.30 గంటలకు అక్కడికి చేరుకుని విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తాలూకా పోలీసులు అక్కడికి చేరుకుని ఆవును వధకు తీసుకొచ్చిన వ్యక్తిని గుర్తించి ఆవును, కొన్ని దూడలకు బలికాకుండా రక్షించారు. వీటిని టెంపో వాహనంలో బెంగళూరు రోడ్డులోని గోశాలకు తరలించారు. అక్కడికి వెళ్లిన బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు లేగదూడలను, ఆవును పరిశీలించి పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకుడు బండి ఆనంద్ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ఎక్కడ కూడా గోవధ జరగకుండా చూస్తామని, డివిజన్‌లో నాలుగు చెక్‌పోస్టులు పెట్టామని పోలీసులు చెప్పారన్నారు. కానీ ఇప్పుడు ఇక్కడ గోవధకు ఆవును తీసుకువస్తున్నా ఈ చెక్‌పోస్టుల్లో పోలీసులు ఎందుకు పట్టుకోలేదన్నారు. పోలీసుల వైఫల్యం వల్లే ఇది జరిగిందన్నారు. తాము మదనపల్లెలో హనుమాన్ ర్యాలీ చేస్తామంటే నాలుగు రోజులు ముందుగానే అడ్డంకులు పెట్టిన పోలీసులు, ఇప్పుడు గోవును ఇక్కడికి తీసుకొచ్చేంత వరకు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీసు ఉన్నతాధికారుల తీరును తప్పుపట్టారు.

ఏడాదిగా స్లాటర్ హౌస్ నిర్వహణ

మదనపల్లె మండలం ఎర్రగన్నమిట్ట దిగువన ఓ వ్యక్తి ఏడాదిగా స్లాటర్‌హౌస్ (జంతు వధశాల) నిర్వహిస్తున్నాడు. ఇక్కడికి ఎద్దులు, వ్యవసాయానికి పనికిరాని పశువులను తీసుకొచ్చి వధించి వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారు. పెద్దఎత్తున పశువులను వధించాక వాటి మాంసాన్ని మదనపల్లె, ఇతర ప్రాంతాలకు ఆటోల్లో సరఫరా చేస్తున్నాడు. ఇలా వధించిన పశువులకు సంబంధించి పెద్ద పెద్ద ఎముకలను అక్కడే ఓ పెద్దగోతి తీసి అందులో ఎముకలను పడేసి పూడ్చి వేస్తున్నాడు. ఈ స్లాటర్‌హౌస్ చుట్టూ చూస్తే బీతావహ వాతావరణం కనిపిస్తోంది. కాగా ఆవును వధించేందుకు తీసుకొచ్చిన వ్యక్తిని జాకీర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.



బెంగళూరు రోడ్డులోని గోశాలకు తరలించిన లేగదూడలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కలసికట్టుగా పనిచేద్దాం

● టీడీపీలో వర్గాలు ఏమీ లేవు
● టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



చమర్తి జగన్‌మోహన్‌రాజుతో భాకరాపేట నాయకులు, కార్యకర్తలు

సిద్దవటం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేద్దామని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. మండలంలోని భాకరాపేట గ్రామంలో ఆదివారం టీడీపీ నేత చెంచయ్యనాయుడు స్వగృహంలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీలో వర్గాలు అంటూ ఏమీ లేవని, అందరూ కలిసికట్టుగా పనిచేసి మండల అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు.

టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం పార్టీకి రాజీనామా చేయడంతో పార్టీ కోసం అందరూ కృషి చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలపాలన్నారు. మండలంలో ఉన్న ప్రతి ఒక్క సమస్యనూ పరిష్కరిస్తామని, ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని తెలిపారు. నూతనంగా పార్టీలోకి ఎవరైనా చేరాలంటే పార్టీ అనుమతి కచ్చితంగా తీసుకోవాలని, చిన్న చిన్న సమన్వయ లోపాల వల్ల ఎన్నికల్లో రాజంపేట అభ్యర్థి ఓటమి చెందారని తెలిపారు.

పార్టీ కార్యకర్తల కృషి కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత చెంచయ్యనాయుడు, ఏపీ పంచాయతీరాజ్ చాంబరు ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, యువ నాయకులు రాజానాయుడు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మాజీ డైరెక్టర్ మల్లు వెంకటసుబ్బారెడ్డి, జ్యోతి సుబ్బారెడ్డి, రాజశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అక్కగార్లకుంట వద్ద గోవుల మాంసాన్ని కోస్తున్న దృశ్యం

48 ఎర్రచందనం దుంగల స్వాధీనం 7

ప్రభుత్వం, పోలీసులు హెచ్చరించినా...

యథేచ్ఛగా గోవధ...

నిమ్మనపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గోవధను చేయవద్దని ప్రభుత్వం, పోలీసుల హెచ్చరించినా లెక్కచేయకుండా ఆదివారం మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ బోడిమల్లదిన్నె మార్గంలో ఉన్న అక్కగార్లకుంట వద్ద కొందరు భారీగా గోవధ చేశారు. అక్కడి నుంచి మాంసాన్ని ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో మండలంలోని చాలా గ్రామాలకు తరలించారు. కాగా శనివారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు నిమ్మనపల్లిలోని సైదాపేటలో పర్యటించి బక్రీద్ పండుగను అడ్డుపెట్టుకుని గోవధ చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయితే సైదాపేటలో ఓ వ్యక్తి కుర్బానీ కొరకు తీసుకువచ్చిన గోవులను పోలీసులు వస్తున్నారని తెలియడంతో అడవిలో వదిలి వేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి గోవులను తరలించకుండా రాచవేటివారిపల్లి వద్ద చెక్‌పోస్టులను పోలీసులు ఏర్పాటు చేసినా పోలీసుల కళ్లు కప్పి వ్యవసాయ పొలాల్లో గుట్టుచప్పుడు కాకుండా గోవులను వధించి ఇళ్లకు తరలించారు. దీనిపై ఎస్‌ఐ తిప్పేస్వామి మాట్లాడుతూ వ్యవసాయ పొలాల్లో గోవులను వధిస్తున్నారని తెలియడంతో తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా అప్పటికే గోవధను చేస్తున్నవారు అక్కడి నుంచి పరారయ్యారని తెలిపారు. గోవధను చేపట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



వధించేందుకు సిద్ధంగా ఉన్న గోవులు

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా ప్రసిద్ధి చెందిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకు పసరు తాగి ఆలయంలో వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చదువులమ్మ చెట్టు నీడలో..

- అంబరాన్నంటిన పాఠశాల స్వర్ణోత్సవాలు
- పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం
- గురువులకు పాదాభివందనం

పెద్దతిప్పసముద్రం జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పెద్దతిప్పసముద్రం మండలం రంగసముద్రం గ్రామంలో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. 1974-75 నుంచి పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థులు గురువులకు పాదాభివందనం చేసి గౌరవాభిమానాలు చాటుకున్నారు. ఆదివారం ఉదయం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలోని సరస్వతీ దేవి విగ్రహానికి పూజలను నిర్వహించి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. 1974- 75లో స్థలాన్ని ఇచ్చి, పాఠశాలను ప్రారంభించేందుకు విశేష కృషి చేసిన రంగసముద్రంకు చెందిన కానాల జగన్నాథరావు, ఎంపీ కృష్ణారెడ్డి, నరసింహప్ప (ఎస్ఎల్ఎన్ మూర్తి) చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ తాము మానవతా విలువలతో కూడిన చదువులు చెప్పామన్నారు. అప్పట్లో ప్రభుత్వం నుంచి జీతాలు కూడా వచ్చేవి కావని, పాఠశాల కోసం స్థలాన్ని ఇచ్చి దాతలే జీతాలు కూడా ఇచ్చేవారన్నారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ ఈ వేడుకలో మళ్లీ కలవడం అపూర్వమైన అనుభూతి కలిగించిందన్నారు. 40 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

గురువులకు పాదాభివందనం చేసి, శాలువాలతో వారిని సత్కరించారు. .మండల విద్యాశాఖాధికారి నారాయణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు మరువలేనివని, పాఠశాల అభివృద్ధిలో భాగంగా వారు చేస్తున్న ఈ కార్యక్రమం ఎంతో విలువైనదన్నారు. అనంతరం అదే పాఠశాలలో 2924-25 పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వైకుంఠ రథానికి రూ.1.80 లక్షలు విరాళం

కొండాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీహైస్కూల్‌లో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు వైకుంఠ రథానికి రూ.1,80,000 విరాళం ప్రకటించారు. ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చెంచిరెడ్డి అభ్యర్థన మేరకు ఈ విరాళం ప్రకటించినట్లు పూర్వ విద్యార్థులు శివశ్రీనివాసులరెడ్డి, బాలనాగిరెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు తెలిపారు. కొండాపురం పరిసర ప్రాంతాల ప్రజలు వైకుంఠ రథం లేక ఇబ్బంది పడుతున్నారని, అందుకే దీనిని విరాళంగా ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.



కొండాపురం జడ్పీహైస్కూల్‌లో పూర్వపు విద్యార్థులు



చెక్కును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మేముసైతం..

- పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం

ఎర్రగుంట్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు రూ.30వేలు విరాళంగా ఇచ్చారు. ఎర్రగుంట్ల బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975-76 బ్యాచ్‌కు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఎర్రగుంట్లలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ బ్యాచ్‌కు చెందిన మాజీ ఏఎంసీ ఎస్.సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అన్వర్, మల్లారెడ్డి, వాసుదేవరెడ్డి, జయరాం తదితరులు మాట్లాడుతూ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగిన వారు ఎందరో ఉన్నారన్నారు. ఈ పాఠశాలను ఎన్నటికీ మరువలేమన్నారు. తమ పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కర్తవ్యంగా ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ముందుబాగంలో ఉన్న ప్రహరీపై దేశనాయకులు, శాస్త్రజ్ఞులు, స్వాతంత్ర్య సమర యోధులు, మేధావుల చిత్రాలు వేసేందుకు ఈ డబ్బును ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబందించిన చెక్కును పాఠశాల హెచ్ఎం రామాంజనేయరెడ్డి, చంద్ర ఓబుళరెడ్డికి అందజేశారు.

ఏపీఈఏపీసెట్‌లో 'నారాయణ' హవా



షేక్ అబ్దుల్, పల్లవి, జగత్‌స్మరణ్ రెడ్డి, రమ్యసాయి, శ్రీలేఖ, సాలెహా, రామ్‌శరణ్, ఐశ్వర్యరాజ్, ధనుష్, సుజన

కడప ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీసెట్ 2025 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు హవా కొనసాగిందని నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫలితాలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో 1000లోపు ర్యాంక్‌లు సాధించారన్నారు. అబ్దుల్ హసీమ్ 146, పల్లవి 232, జగత్ స్మరణ్ రెడ్డి 351, శ్రీలేఖ-410, రామ్‌శరణ్ 566, ఐశ్వర్యరాజ్ 587, ధనుష్ 764, రమ్యసాయి 772, సాలిహా 899, సుజనా 979 టాప్ ర్యాంక్స్ సాధించారన్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులను డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, సుబ్బారావు, బాలవెంకటరెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్, వెంకటస్వామి, సుధాకరరెడ్డి, సౌజన్య ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఏపీఈఏపీసెట్‌లో 6254 మంది ఉత్తీర్ణత

రాయచోటిటౌన్, జూన్8(ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్‌లో అన్నమయ్య జిల్లా నుంచి 6254 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశం కోసం ప్రభుత్వం నిర్వహించిన ఏపీ ఎంసెట్‌కు అన్నమయ్య జిల్లా నుంచి 9854 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ప్రభుత్వం మే నెలలో నిర్వహించిన పరీక్షలకు 9444 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 6254 మంది ఉత్తీర్ణత సాధించారు. అర్హత సాధించిన వారికి ఈనెల చివరలో ఆయా కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

లారీ,ఆటో ఢీ.. ఒకరు మృతి

మైదుకూరు రూరల్ ,జూన్ 8(ఆంధ్రజ్యోతి) : లారీ, ఆటో ఢీకొనడం ఉప్పుగుంటపల్లెకు చెందిన వెంపర్ల చిన్న వెంకటసుబ్బయ్య (65) అక్కడిక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మైదుకూరు నుంచి బద్వేల్ వైపు వెళుతున్న లారీ, జీవి సత్రం నుంచి మైదుకూరు వైపునకు వస్తున్న ఆటో స్థానిక బద్వేల్ రోడ్డులోని పైపుల ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం ఢీకొన్నాయి. దీంతో ఆటోలోని వ్యక్తి లారీ కింద పడి అక్కడిక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.మైదుకూరు పట్టణానికి వెలుపల జరుగుతున్న రోడ్డు పనుల్లో భాగంగా గుత్తేదారుల నిర్లక్ష్యం వలన ఈ మధ్య కాలంలో ముగ్గురు మృతి చెందారు. రోడ్డుపై ఎలాంటి సూచిక బోర్డులు లేక పోవడమే ఈ ప్రమాదాలకు కారణమని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సూచిక బోర్డులను పెట్టి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరు..



సంఘటన స్థలంలో పడి ఉన్న ద్విచక్రవాహనాలు

వీరపునాయునిపల్లె, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాయసంపల్లె గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీ సుల కథనం మేరకు సికెదిన్నె మండలం తాడిగట్ల గ్రామానికి చెందిన ముంతా రవి (35), లేవనూరు నాని ద్విచక్రవాహనంపై సంతకొవ్వూరు గంగమ్మ దర్శనా నికి వెళ్తుండగా పాయసంపల్లె సమీపంలో మరో బైక్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ముంతా రవి అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన లేవనూరు నానిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు.

బైక్‌లను ఆటో ఢీకొనడంతో ఒకరు..



వెంకటరత్నం (ఫైల్ ఫొటో)

రాజంపేట టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఒక ఆటో ఒకదాని వెనుక ఒకటి వస్తున్న రెండు బైకులను ఢీకొనడంతో వెంకటరత్నం(52) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి కడపకు చెందిన ఎ.వెంకటరత్నం, నవీన్‌కుమార్ ఆదివారం పెనగలూరు మం డలం ఓబిలి గ్రామంలో అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తుండగా పట్టణంలోని బైపాస్‌లో ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట రత్నం మృతి చెందగా, నవీన్ కుమార్‌కు గాయాలయ్యాయి. అదే ఆటో వీరి వెనుకే వస్తున్న మరో బైక్‌ను సైతం ఢీకొంది. దీంతో ఆ బైకుపై ప్రయాణిస్తున్న రాజంపేట తహసీల్దారు కార్యాలయ ఉద్యోగి మణి, ఎల్.సుమలత గాయపడ్డారు. వీరిని తిరుపతికి తరలించారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజంపేట పట్టణ పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

కమలాపురం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యో తి): వడదెబ్బ కారణంగా ఉపాధికూలీ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు మండల పరిధిలోని కొండాయపలెకు చెంది న చిట్టిబోయిన ఓబులేసు (53) శనివారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. పని పూర్తయిన అనంతరం ఇంటికి వస్తుండ గా వడదెబ్బకు గురయ్యాడు. వెంటనే బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుం బ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై ఏపీవో పార్థసారథి మాట్లాడుతూ ఓబులేసు ఉపాధి పనికి వచ్చిన మాట వాస్తవమేనని, మస్టరులో కూడా పేరు నమోదు చేశారని, అయితే మార్గమధ్యం లో వడదెబ్బ తగలడంతో శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారని తెలిపారు. డాక్టరు రిపోర్టు తీసుకుని ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

కారు ఢీకొని ఏఎస్ఐకి గాయాలు

చెన్నూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఏఎస్ఐ తీవ్రం గా గాయపడ్డాడు. సింహాద్రిపురం మండలంలో ఏఎస్ఐగా పని చేస్తున్న పి.సుధాకర్ ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంలో చెన్నూరు కు వస్తుండగా కొత్తరోడ్డు వద్ద కడప నుంచి ఖాజీపేట వైపు వెళుతున్న కారు వెనుకనుంచి ఢీకొంది. దీంతో గాయపడిన ఆయనను స్థానికులు కడపలోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నూరు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండులో చిన్నారి.. సంరక్షణకు ఎస్ఐ చర్యలు

పోరుమామిళ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో పలువురు పిల్లల కోసం హాస్పిటళ్ల చుట్టూ తిరిగి డబ్బులు ఖర్చు చేస్తున్నారు. కానీ కొందరు తమ పిల్లలే భారంగా భావించి ఎక్కడ పడితే అక్కడ వదిలేస్తున్నారు. అలాంటి సంఘటనే ఆదివారం పోరుమామిళ్లలో జరిగింది. స్థానిక ఆర్టీసీ బస్టాండులో తొమ్మిదినెలల చిన్నారిని ఎవరో వదిలేసి వెళ్లారు, ఎన్ని గంటలైనా ఎవరూ రాకపోవడంతో అక్కడి వారు ఎస్ఐ కొండారెడ్డికి సమాచారం అందించారు. వెంటనే ఆయన చిన్నారిని పోలీసుస్టేషన్‌కు తీసకువచ్చి విచారణ చేశారు. ఎటువంటి సమాచారం రాకపోవడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు అప్పజెప్పి, శిశు సంక్షేమశాఖలో చేర్చేందుకు చర్యలు తీసుకున్నారు.

48 ఎర్ర చందనం దుంగలు స్వాధీనం

- నలుగురు అరెస్ట్

తంబళ్లపల్లె, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 48 ఎర్రచందనం దుంగలు, ఓ ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేసినట్లు తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ చిరంజీవులు, ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం, స్థానిక అటవీ శాఖ అధికారులు జయప్రసాదరావు, మోహన్‌రెడ్డి, షబీన్‌తాజ్ సహకారంతో బి. కొత్తకోట మండలం బురకాయలకోట అటవీ ప్రాంతంలోని వేపూరికోట ఫారెస్ట్ బీటు పరిధిలో ఆదివారం తెల్లవారుజామున తనిఖీలు చేస్తుండగా తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె సమీపంలోని వంక గట్టున ఓ ద్విచక్రవాహనం కనిపించింది. దీంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా, కొందరు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో తనిఖీ చేయగా, 48 ఎర్రచందనం దుంగలు లభించినట్లు తెలిపారు. పట్టుబడిన వారు ములకలచెరువు మండలం సోంపల్లెకు చెందిన సుధాకర్, రాజుగారిపల్లెకు చెందిన లక్ష్మీపతినాయుడు, పెద్దమండ్యం మండలం కురవపల్లెకు చెందిన మల్లికార్జున, గుర్రంకొండ మండలం మద్యాన్నాంవారిపల్లెకు చెందిన సురేంద్రరెడ్డిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడినవారితో పాటు, ఎర్రచందనం దుంగలు, ద్విచక్రవాహనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడిన ఎర్రచందనం దుంగలతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మహిళ విషయంలో రెండు గ్రామాల మధ్య ఘర్షణ

- పలువురికి తీవ్రగాయాలు

రామసముద్రం/ మదనపల్లెటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత కుటుంబాన్ని వదిలి ప్రియుడితో కలసి వెళ్లిపోయి రెండు కుటుంబాలు, రెండు గ్రామాల మధ్య ఘర్షణకు కారణమైంది. శనివారం రాత్రి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కర్రలు, కత్తులతో దాడి చేసుకోవడంతో ఏడుగురు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే కమ్మవారిపల్లె పంచాయతీ బొర్రబోయనిపల్లెకు చెందిన ఓ వివాహిత పది రోజుల క్రితం తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఆర్.నడింపల్లె పంచాయతీ శ్రీరాముల పల్లెకు చెందిన ఓ యువకుడితో వెళ్లిపోయింది. ఈ విషయమై ఎర్రబోయనపల్లెకి చెందిన గంగప్ప, శ్రీరాములపల్లికి చెందిన వెంకటప్ప కుటుంబాల మధ్య పదిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఎస్ఐ రవికుమార్ శనివారం రెండు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి రాజీ కుదిర్చి, గొడవపడకూడదని సర్ది చెప్పి, స్టేట్‌మెంట్ తీసుకుని పంపేశారు. ఆదివారం మళ్లీ ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో కర్రలు, కొడవళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో కమ్మవారిపల్లె పంచాయతీ ఎర్రబోయనపల్లెకి చెందిన మాజీ సర్పంచ్ కె.చిన్న వెంకటప్ప(67), కె.వెంకటరమణ(45), యశ్వంత్(25), సుధాకర్ (35), కె.గంగాధర్(30), విశ్వనాథ్ గాయపడగా ప్రత్యర్థి వర్గానికి చెందిన శ్రీరాములపల్లె వెంకటప్ప, అతని అనుచరులు కృష్ణమూర్తి, వెంకటరమణకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో కొందరు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో, కొందరు కోలార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం క్షతగాత్రులను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాష్ట్ర టీడీపీ యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు పరామర్శించారు. శ్రీరామ్ చినబాబు క్షతగాత్రులను రాష్ట్ర హోంమంత్రితో ఫోన్‌లో మాట్లాడించి అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉండగా మహిళ తండ్రి శాంతప్ప తనకు కొంత డబ్బు ఇవ్వాల్సి ఉందని, డబ్బు అడిగినందుకు తనపై దాడి చేశారని శ్రీరాములపల్లెకు చెందిన వెంకటప్ప ఆరోపిస్తున్నారు. మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి చేరుకుని ఘటనకు గల కారణాలను ఆరా తీసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామసముద్రం ఎస్ఐ రవికుమార్ తెలిపారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

హార్సిలీహిల్స్‌లో సందడే.. సందడి



స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు



అందమైన లొకేషన్‌లో యువజంట ఫొటోషూట్

బి.కొత్తకోట, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాఊటీగా పేరుగాంచిన హార్సిలీహిల్స్‌లో ఆదివారం సందడి నెలకొంది. వేసవి సెలవులు ఈ వారంతో ముగియనుండటం, బక్రీద్ పండుగ మరుసటి రోజుతో పాటు, వారాంతం కావడంతో పలు వర్గాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో హిల్స్‌కు చేరుకున్నారు.దీంతో శనివారం రాత్రి ఏపీ టూరిజంకు చెందిన 57 అద్దె గదులూ భర్తీ కావడంతో పాటు, ప్రైవేటు రెస్టారెంట్లు, అతిథిగృహాల కిక్కిరిశాయి. ఆదివారం స్విమ్మింగ్‌పూల్‌లో సేదతీరుతూ, గాలిబండ, ఏరియల్ వ్యూ పాయింట్ నుంచి 4312 అడుగుల కిందనున్న ప్రకృతి అందాలను తిలకిస్తూ ఉల్లాసంగా గడిపారు. అటవీశాఖ ప్రాంగణంలోని జూపార్క్, మానస సరోవరంలో బోటింగ్ వద్ద పర్యాటకుల రద్దీ కనిపించింది. ప్రాంగణంలోని హార్సిలీహిల్స్ ఐకాన్‌తో పాటు, సుందరమైన లొకేషన్లలో పలు నూతన జంటలు ఫొటోషూట్‌లో పాల్గొనడం కనిపించింది. కొండపై ఎక్కడచూసినా జనసంచారం కనిపించింది.

'సీపీఎం కార్యకర్తలు సైద్ధాంతిక స్థాయిని పెంచుకోవాలి'

కడప సెవెన్ రోడ్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారీ సమాజంలో దోపిడీ, పెత్తందారుల దుర్మార్గాలు, అన్యాయాలను ప్రశ్నించాలంటే సైద్ధాంతిక, రాజకీయ, సామాజిక స్పృహ స్థాయిని తప్పనిసరిగా పెంచుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, సీనియర్ నాయకుడు దడాల సుబ్బారావు కార్యకర్తలకు సూచించారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో శాస్త్రీయ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనతా ప్రజాతంత్ర విప్లవ వ్యూహం, ఎత్తుగడలు, విప్లవ దశలు, పార్టీ కార్యక్రమం దశ, దిశలు వంటి వాటిపై పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని తెలిపారు. జమీందారులు, భూస్వాముల ఆర్థిక, సామాజిక, మానసిక దోపిడీలకు వ్యతిరేకంగా ఆనాడు పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించి, ప్రజాచైతన్యంతో తిరుగుబాటు చేసి లక్షలాది ఎకరాలు దున్నేవాడికి భూ పంపిణీ చేశారని తెలిపారు. పెట్టుబడిదారీ సమాజంలో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలు, మతోన్మాద శక్తులను ఎదుర్కోవాలంటే సీపీఎం కార్యకర్తలు ఉక్కు క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ వి.అన్వేష్, జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్, వి.మనోహర్, కె.శ్రీనివాసులశెడ్డి, బి.దస్తగిరిరెడ్డి, కె.సత్యనారాయణ, కె.శ్రీనివాసులు, కుమారస్వామిరెడ్డి, చంద్రారెడ్డి, శివరామ్, వెంకటేశ్వర్లు, వి.శివకుమార్, జి.సునీల్‌కుమార్, చిన్ని, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

దొంగ అరెస్టు: బంగారం స్వాధీనం

కడప క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని ఆదివారం కడప ఎయిర్‌పోర్టు వద్ద అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కడప మోచంపేటలోని చిలకలబావికి చెందిన షేక్ అక్బర్ ఆలీ ఎలక్ట్రీషియన్. క్రికెట్ బెట్టింగ్, జూదాలకు అలవాటుపడ్డాడు. వాటికి అవసరమయ్యే డబ్బుకోసం చోరీలు ప్రారంభించాడు. .ఈ నేపథ్యంలో కడప నగరంలోని వివిధ పోలీసుస్టేషన్‌లలో ఇతనిపై దాదాపు 20 కి పైగా కేసులు నమోదయ్యాయి. దొంగతనం కేసులో జైలుకు వెళ్లి తిరిగి వచ్చినా, చోరీలు మానుకోలేదు. ఇటీవల ఎన్జీవో కాలనీ, మృత్యుంజయకుంట, అక్కాయపల్లెలో చోరీ చేసిన బంగారు నగలు తీసుకుని పారిపోతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి అక్బర్ ఆలీని అరెస్టు చేసి, 40.160 గ్రాములు బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని రిమాండుకు తరలించినట్లు వివరించారు.

ఏరువమ్మ ఆలయంలో చోరీ

వీరబల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిగువరాచపల్లి పంచాయతీలో ఉన్న ఏరువమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ పూజారి నాగభూషణం కథనం మేరకు ఆదివారం ఉదయం ఆలయం తలుపులు తెరిచేసరికి అమ్మవారి వస్త్రాలు, ఆభరణాలు చిందరవందరగా పడి కనిపించాయి. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కాగా, ఆలయంలోని నగలు బంగారంతో చేసినవి కాదని భావించి అక్కడే పడేసి వెళ్లినట్లు పూజారి తెలిపారు. నిందితులను గుర్తించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గురిజాలలో గాలి వానకు నేలకొరిగిన అరటి

సింహాద్రిపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురిజాల గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం పెనుగాలులు, వానకు అరటిచెట్లు నేలకొరిగి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. గ్రామంలో రామ్మోహన్‌రెడ్డికి చెందిన 2500, చెన్నకేశవరెడ్డికి చెందిన 1000 , శ్రీధర్‌రెడ్డికి చెందిఇన 300అరటి చెట్లతోపాటు, సింహాద్రిపురంలో మరికొంతమంది కి చెందిన అరటిచెట్లు గాలికి పడిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

చెత్త తొలగించండి



మండలంలోని పాపిరెడ్డిపల్లెలో చెత్త పేరుకుపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ఆర్ఎంపీ వైద్యశాల వద్ద చెత్తాచెదారం దర్శనమిస్తోందన్నారు. డిస్పోజల్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు ఎక్కడపడితే అక్కడ పడి ఉన్నా పట్టించుకునే వారు లేరని, దోమలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలే అవకాశం ఉందని రిటైర్డ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చల్లా లక్ష్మీకర్‌రెడ్డి తదితరులు పేర్కొన్నారు.

-ఓబులవారిపల్లె, (ఆంధ్రజ్యోతి)

సోలార్ బాధితులకు త్వరలో పరిహారం



గుండ్లచెరువులో పర్యటిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు,జూన్8(ఆంధ్రజ్యోతి): తూముకుంట పంచాయతీ ప్రకాశ్‌నగర్ కాలనీ సమీపంలో ఏర్పాటు చేయనున్న నూతన సోలార్ పవర్ ప్లాంట్‌కు భూములు కోల్పోతున్న రైతులకు త్వరలో నష్టపరిహారం అందజేయనున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ యన ఆదివారం గుండ్లచెరువుకు చెందిన టీడీపీ నా యకుడు ఉదయ్‌కుమార్ ఇచ్చిన విందులో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ 100 మెగావాట్లతో సోలార్ విద్యుత్ పవర్ ప్లాంట్‌ను తూముకుంట పంచాతీలో ఏర్పాటు చేయనున్నారని, ఇందులో 64 ఎకరాలు డీకేటీ భూమి, 30 ఎకరాలు సాగుభూమి, 30 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. గతంలో డీకేటీ భూమికి రెండు లక్షలు ఇచ్చారని, కానీ ఏడాది ఎక్కువ మొత్తలో ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. అలాగే ఎలాంటి ఆధారాలు లేకుండా అనుభవంలో గల భూమికి ఎకరాకు రూ.లక్ష ఇప్పించడానికి కృషి చేస్తానని రైతులకు మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య నిర్మూలనకు మెగా డీఎస్సీ

చిన్నమండెం, జూన్8(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్య నిర్మూలనకు మెగా డీఎస్సీ నిర్వహిస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగదరిపల్లెలోని త మ నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16,437 టీచర్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను నివారించేందుకు చర్యలు చేపడుతోందన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు.

తమటంవారిపల్లె దళితవాడలో తాగునీటి కష్టాలు

● నెల రోజులైనా పట్టించుకోని అధికారులు



బోరు వద్ద నిరసన తెలుపుతున్న తమటంవారిపల్లె దళితవాడ వాసులు

రాయచోటి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామం తమటంవారిపల్లె దళితవాడలో దళితులు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. తాగునీటి బోరు, మోటారు కాలిపోయి నెల రోజులు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం బోరు వద్ద దళితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ కొత్తగా బోరు వేయమని అడగలేదని, వెలిగల్లు ప్రాజెక్టు నుంచి పైపులైన్ వేయమని అడగలేదు. కేవలం కాలిపోయిన బోరు, మోటారును రిపేరు చేయించమని బతిమాలినా కనికరం చూపడం లేదని వాపోతున్నారు. గతంలో కూడా ఇదే బోరు మోటారు కాలిపోతే దళితులే చందాలు వేసుకుని రిపేరు చేయించుకున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరు మోటారుకు రిపేరు చేయించి తమటంవారిపల్లె దళితవాడలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వీహెచ్‌పీ సత్సంగ జిల్లా అధ్యక్షుడిగా వెంకటరెడ్డి



దరిశా వెంకటరెడ్డి

రైల్వేకోడూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ పరిషత్ సత్సంగ జిల్లా అధ్యక్షుడిగా రైల్వే కోడూరుకు చెందిన దరిశా వెంకటరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లెలో విశ్వహిందూ పరిషత్ కార్యవర్గ నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఓబులవారిపల్లె మండలం మంగంపేట కాపుపల్లెకు చెందిన పులపుత్తూరి సుదర్శన్‌రెడ్డిని విశ్వహిందూపరిషత్ ప్రఖండ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఓబులవారిపల్లె మండల ప్రఖండ అధ్యక్షుడిగా గల్లా ధనుంజయ్‌ను ఎన్నుకున్నారు.

యోగాంధ్రాను జయప్రదం చేద్దాం

సుండుపల్లె, జూన్8(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 7 గంటలకు యోగా కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖలతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా కోరారు.

నేడు ప్రతిభా అవార్డుల ప్రదానం

సుండుపల్లె, జూన్8(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి ప్రతిభా అవార్డులకు ఎంపికైన విద్యార్థులకు సోమవారం నగదుతో పాటు ప్రశంసాపత్రాలను అందజేయనున్నట్లు ఎంఈవో వెంకటేశ్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు అన్నమయ్య జి ల్లా కేంద్రమైన రాయచోటిలోని సుధ ఈవెంట్స్ ఫంక్షన్ హాలులో జరిగే కార్యక్రమానికి విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి హాజరుకావాలని కోరారు. రూ.20 వేలు నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారన్నారు.

నందలూరు:మండలానికి చెందిన సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థులు హుమేర తబసుమ్, మహమ్మద్ సుమియా బేగ్ షైనింగ్ స్టార్స్ అవార్డ్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ భూమన శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అందించే అవార్డులకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు కమల, ఉపాధ్యాయ బృందం అవార్డులకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అమ్మవారికి బోనాలను తీసుకెళుతున్న భక్తులు





ఘనంగా మారమ్మ జాతర

నందలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లెలో వెలసిన మారమ్మతల్లి జా తర ఆదివారం అత్యంత ఘనంగా జరిగింది. మ హిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. జనసేనపార్టీ జిల్లా అధ్యక్షుడు యల్లటూ రు శ్రీనివాసరాజు అమ్మవారిని దర్శించుకున్నా రు. ఈ యన వెంట మాజీ జడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ ఉన్నారు.

వైభవంగా అంకాలమ్మ జాతర

రాజంపేట టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఊటుకూరులో ఆదివారం అంకాలమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పొంగుబాళ్లు సమర్పించారు. కుంకుమార్చన నిర్వహించి మొ క్కులు తీర్చుకున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించి ఈ జాతరలో గ్రామానికి నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

సిద్దవటం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం-1 పంచాయతి పరిధిలో ఉన్న ఎస్‌కేఆర్ ఎస్సీ కాలనిలో వెలసిన శ్రీ అంకాలమ్మ అమ్మవారి తిరునాల మహోత్సవంలో భాగంగా ఆదివారం వృషభరాజులచే నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతి 50 వేలు వైఎస్ఆర్ జిల్లా చాపాడు మండలం రాజువారిపేట గ్రామానికి చెందిన లింగారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఎద్దులు గెలుపొందాయి. రెండో బహుమతి రూ.30 వేల రూపాయలను కడప రూపవారిపల్లెకు చెందిన బొజ్జా విద్యుఓబుల్ రెడ్డి, ఎద్దులు, మూడో బహుమతి రూ.20 వేలు బద్వేల్ మండలం కుమ్మరి కొట్టాలకు చెందిన మినుకొండ రఫీ, వల్లూరు మండలం శీతోరుపల్లెకు చెందిన చందా ప్రణీత్‌కుమార్‌రెడ్డి ఎద్దులు సంయుక్తంగా పోటీల్లో పాల్గొని సాధించారు. నాలుగో బహుమతి అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం వరదాయపల్లె గ్రామానికి చెందిన దత్త శ్రీరాములు ఎద్దులు 15 వేల రూపాయలను గెలుచుకున్నారు.మొదటి బహుమతి 50 వేలు రాజంపేట పార్లమెంట్ జనసేన సమన్వయకర్త అతికారి కృష్ణ, రెండో బహుమతి 30 వేల రూపాయల ను ఏపీ పంచాయతిరాజ్ చాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరి కుప్పాల వెంకట సుబ్బయ్య, మూడో బహుమతి రూ.20 వేలను టీడీపీ పార్లమెంట్ వాణిజ్య అధికార ప్రతినిధి చలపాటి చంద్ర, నాలుగో బహుమతిని రూ.15 వేలను జనసేన కూటమి యువనేత శ్రీకాంత్‌లు అమ్మవారి గుడి వద్ద అందజేశారు.

సుబ్బరామరాజుకు నివాళి

వీరబల్లి, జూన్8 (ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండలంలోని గడికోట గ్రామ పంచాయతీ కస్పాకు చెందిన మండల మాజీ టీడీపీ అధ్యక్షుడు చమర్తి సుబ్బరామరాజు మృతదేహానికి టీడీపీ మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా సుబ్బరామరాజు శనివారం రాత్రి మృతిచెందిన విషయం తెలిసిందదే.

అమ్మవారి చీరలు వేలంపాట

వీరబల్లి, జూన్8(ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండలం వంగిమళ్ల పెద్దూరులో కొలువుతీరని యల్లమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి చీరలకు వేలంపాట నిర్వహించారు. వంగిమళ్ల, దిగువరాచపల్లి గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు వేలంపాటలో పాల్గొని అమ్మవారి చీరలను దక్కించుకున్నారు. కల్లేవాండ్లపల్లె ఆదినారాయణరెడ్డి ఒక చీరను రూ.4500కు దక్కించుకొని మొదటి స్థానంలో నిలువగా నాగిరెడ్డిగారిపల్లెకు చెందిన కల్లూరి శ్రీనివాసులరెడ్డికి మరొక చీరను రూ.4100తో దక్కించుకుని రెండవ స్థానంలో నిలిచారు. దాదాపు 112 అమ్మవారి చీరలకు వేలంపాట నిర్వహించగా 1,47,300 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అనారోగ్యంతో జవాన్ మృతి

రామసముద్రం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలవానెల్లూరు పంచాయతీ పిలిగుండ్లపల్లెకు చెందిన జవాన్ మురళి(38) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఇతను 15ఏళ్లుగా జవాన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అండమాన్ నికోబార్ దీవుల్లో విధులు నిర్వర్తిస్తుండగా 20రోజుల కిందట కాలికి గాయమై అది తీవ్రతరం కాగా చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చెన్నై నుంచి పిలిగుండ్లపల్లెకు మురళి మృతదేహాన్ని తెచ్చి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.

యోగాంధ్రలో పాల్గొనాలి

బి.కొత్తకోట, జూన్8 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు నేడు బి.కొత్తకోట మండలం గట్టు గ్రామ జడ్పీహైస్కూల్ గ్రౌండ్‌లో 2025యోగా శిక్షణను విజయవంతం చేయాలని ఎంపీడీఓ క్రిష్ణవేణి కోరారు.

హరిత గ్రామాలే లక్ష్యం



మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నందలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను హరిత వనాలుగా చేయడమే లక్ష్యంగా లయన్స్‌క్లబ్ వారు ముందుకెళుతోందని విభ ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బచ్చు జయభాస్కర్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం నందలూరు కన్యకచెరువు అలుగు వద్ద ఉన్న అనంతపురం అమ్మ దేవాలయం ఆవరణంలో మొక్కలు నాటారు.

భలే.. భలే మామిడి



మా మామిడి భలే రుచి.. రండి... కొనండి.. అంటూ చిరు వ్యాపారులు వివిధ రకాల మామిడి పండ్లను విక్రయిస్తున్నారు. ఇందులో బేనీషా, పులిహోరా, రుమాణి, కాలేపాడు, రసాలు, మాల్గోవా, ఖాదర్, మల్లిక తదితర రకాలను సరసమైన ధరలకే అమ్ముతున్నారు. తోటల్లోనే కాయలను కొనుగోలు చేసి వాటిని గోనె సంచుల్లో తీసుకొచ్చి ఇంట్లోనే మాగబెట్టి గంపల్లో పెట్టి విక్రయిస్తున్నారు. వినియోగదారుడికి రుచికరమైన పండ్లను అందివ్వాలనే ఉద్దేశ్యంతో రసాయనిక పదార్థాలను ఉపయోగించకుండా గడ్డిలోనే మాగబెట్టుతున్నాం అంటున్నారు.

- రైల్వేకోడూరు, ఆంధ్రజ్యోతి

సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం

లక్కిరెడ్డిపల్లె, జూన్8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనయుడు నిశ్చల్‌నాగిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లెలోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్‌మోహన్, రాజంపేట పార్లమెంట్ డాక్టర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్, నాయకులు అంజనేయులు, రామాంజనేయులు, మూగి రమణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తాము చదివిన ఆదర్శ పాఠశాలలో పూర్వ విద్యార్థులు

రామాపురం, జూన్8(ఆంధ్రజ్యోతి): రామాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో 2015-16 విద్యా సంవత్సరంలో 10వ తర గతి పూర్తి చేసిన పూర్వపు విద్యార్థులు ఆదివారం తమ పాఠశాలలో ఘనంగా పూర్వపు విద్యార్థుల సమ్మేళనం (గెట్- టుగెదర్) నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అనుమతిచ్చిన జిల్లా విద్యాశాఖాధికారికి, ప్రస్తుత ప్రిన్సిపాల్ శ్యామలాదేవిలకు పూర్వపు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

జూలై 9న జరిగే సమ్మెను విజయవంతం చేద్దాం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రాయచోటి టౌన్, జూన్8(ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్ల రద్దు కోసం జూలై 9 జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చే ద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ చంద్రశేఖర్, రవికుమార్, వెంకట్రామయ్య, మణి, రాజమ్మతో పాటు జిల్లా నుండి పెద్ద ఎత్తున సీపీయం కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ

పెనగలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పెనగలూరులో వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారి ఊంజల్ సేవను శక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, వరలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ధర్మకర్త, మాజీ ధర్మకర్తలతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఎంజీ పురంలో ఉచిత కంటి వైద్యశిబిరం



మాట్లాడుతున్న శరత్‌కుమార్‌రాజు

రాజంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): 'అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ యూఎస్‌ఏ' ఫౌండర్ చైర్మన్ డాక్టర్ భూపతిరాజు సహకారంతో ఎంజీపురంలో ఆదివారం తిరుపతి వాసన్ ఐకేర్ ఆసుపత్రిచే ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కడప, అన్నమయ్య జిల్లాల ఇన్‌చార్జి, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కొండూరు శరత్‌కుమార్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 25 మందికి కంట్లో శుక్లాలు ఉన్నందున ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అంజన్‌రాజు, శివరామరాజు, గ్రామ పెద్దలు విశ్వనాథరాజు, శంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రేణుకా యల్లమ్మకు పూజలు

సిద్దవటం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండల పరిధిలోని మాచుపల్లెలోని రేణుకా యల్లమ్మకు ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. సిద్దవటంవాసి అక్కిశెట్టి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బండారు రాజగోపాలయ్య దంపతులు, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, ఏపీ పంచాయతీరాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



మంగళసూత్రాన్ని చూపుతున్న పండితులు

నందలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి అరవపల్లెలోని కోదండరామస్వామి పునఃప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సీతారాములవారి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు సరసా రవికుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, జనసేనపార్టీ జిల్లా అధ్యక్షుడు యల్లటూరు శ్రీనివాసరాజు, జడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ కల్యాణంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

చదువులమ్మ చెట్టు నీడలో..

- అంబరాన్నంటిన పాఠశాల స్వర్ణోత్సవాలు
- పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం
- గురువులకు పాదాభివందనం

పెద్దతిప్పసముద్రం జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పెద్దతిప్పసముద్రం మండలం రంగసముద్రం గ్రామంలో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. 1974-75 నుంచి పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థులు గురువులకు పాదాభివందనం చేసి గౌరవాభిమానాలు చాటుకున్నారు. ఆదివారం ఉదయం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలోని సరస్వతీ దేవి విగ్రహానికి పూజలను నిర్వహించి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. 1974- 75లో స్థలాన్ని ఇచ్చి, పాఠశాలను ప్రారంభించేందుకు విశేష కృషి చేసిన రంగసముద్రంకు చెందిన కానాల జగన్నాథరావు, ఎంవీ కృష్ణారెడ్డి, నరసింహప్ప (ఎస్ఎల్ఎన్ మూర్తి) చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ తాము మానవతా విలువలతో కూడిన చదువులు చెప్పామన్నారు. అప్పట్లో ప్రభుత్వం నుంచి జీతాలు కూడా వచ్చేవి కావని, పాఠశాల కోసం స్థలాన్ని ఇచ్చి దాతలే జీతాలు కూడా ఇచ్చేవారన్నారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ ఈ వేడుకలో మళ్లీ కలవడం అపూర్వమైన అనుభూతి కలిగించిందన్నారు. 40 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన గురువులకు పాదాభివందనం చేసి, శాలువాలతో వారిని సత్కరించారు. .మండల విద్యాశాఖాధికారి నారాయణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు మరువలేనివని, పాఠశాల అభివృద్ధిలో భాగంగా వారు చేస్తున్న ఈ కార్యక్రమం ఎంతో విలువైనదన్నారు. అనంతరం అదే పాఠశాలలో 2924-25 పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

వైకుంఠ రథానికి రూ.1.80 లక్షలు విరాళం

కొండాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీహైస్కూల్‌లో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు వైకుంఠ రథానికి రూ.1,80,000 విరాళం ప్రకటించారు. ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చెంచిరెడ్డి అభ్యర్థన మేరకు ఈ విరాళం ప్రకటించినట్లు పూర్వ విద్యార్థులు శివశ్రీనివాసులరెడ్డి, బాలనాగిరెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు తెలిపారు. కొండాపురం పరిసర ప్రాంతాల ప్రజలు వైకుంఠ రథం లేక ఇబ్బంది పడుతున్నారని, అందుకే దీనిని విరాళంగా ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.



కొండాపురం జడ్పీహైస్కూల్‌లో పూర్వపు విద్యార్థులు



చెక్కును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మేముసైతం..

- పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం

ఎర్రగుంట్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు రూ.30వేలు విరాళంగా ఇచ్చారు. ఎర్రగుంట్ల బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975-76 బ్యాచ్‌కు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఎర్రగుంట్లలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ బ్యాచ్‌కు చెందిన మాజీ ఏఎంసీ ఎస్.సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అన్వర్, మల్లారెడ్డి, వాసుదేవరెడ్డి, జయరాం తదితరులు మాట్లాడుతూ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగిన వారు ఎందరో ఉన్నారన్నారు. ఈ పాఠశాలను ఎన్నటికీ మరువలేమన్నారు. తమ పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కర్తవ్యంగా ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ముందుభాగంలో ఉన్న ప్రహరీపై దేశనాయకులు, శాస్త్రజ్ఞులు, స్వాతంత్ర్య సమర యోధులు, మేధావుల చిత్రాలు వేసేందుకు ఈ డబ్బును ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన చెక్కును పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయరెడ్డి, చంద్ర ఓబుళరెడ్డికి అందజేశారు.

ఏపీఈఏపీసెట్‌లో 'నారాయణ' హవా



షేక్ అబ్దుల్ | పల్లవి | జగత్‌స్మరణ్ రెడ్డి | రమ్యసాయి | శ్రీలేఖ



సాలెహా | రామ్‌శరణ్, | ఐశ్వర్యరాజ్ | ధనుష్ | సుజన

కడప ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీసెట్ 2025 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు హవా కొనసాగిందని నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫలితాలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో 1000లోపు ర్యాంక్‌లు సాధించారన్నారు. అబ్దుల్ హసీమ్ 146, పల్లవి 232, జగత్ స్మరణ్ రెడ్డి 351, శ్రీలేఖ-410, రామ్‌శరణ్ 566, ఐశ్వర్యరాజ్ 587, ధనుష్ 764, రమ్యసాయి 772, సాలిహా 899, సుజనా 979 టాప్ ర్యాంక్స్ సాధించారన్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులను డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, సుబ్బారావు, బాలవెంకటరెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్, వెంకటస్వామి, సుధాకరరెడ్డి, సౌజన్య ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఏపీఈఏపీసెట్‌లో 6254 మంది ఉత్తీర్ణత

రాయచోటిటౌన్, జూన్8(ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్‌లో అన్నమయ్య జిల్లా నుంచి 6254 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశం కోసం ప్రభుత్వం నిర్వహించిన ఏపీ ఎంసెట్‌కు అన్నమయ్య జిల్లా నుంచి 9854 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ప్రభుత్వం మే నెలలో నిర్వహించిన పరీక్షలకు 9444 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 6254 మంది ఉత్తీర్ణత సాధించారు. అర్హత సాధించిన వారికి ఈనెల చివరలో ఆయా కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

లారీ,ఆటో ఢీ.. ఒకరు మృతి

మైదుకూరు రూరల్ జూన్ 8(ఆంధ్రజ్యోతి) : లారీ, ఆటో ఢీకొనడం ఉప్పుగుంటపల్లెకు చెందిన వెంపర్ల చిన్న వెంకటసుబ్బయ్య (65) అక్కడిక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మైదుకూరు నుంచి బద్వేల్ వైపు వెళుతున్న లారీ, జీవి సత్రం నుంచి మైదుకూరు వైపునకు వస్తున్న ఆటో స్థానిక బద్వేల్ రోడ్డులోని పైపుల ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం ఢీకొన్నాయి. దీంతో ఆటోలోని వ్యక్తి లారీ కింద పడి అక్కడిక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.మైదుకూరు పట్టణానికి వెలుపల జరుగుతున్న రోడ్డు పనుల్లో భాగంగా గుత్తేదారుల నిర్లక్ష్యం వలన ఈ మధ్య కాలంలో ముగ్గురు మృతి చెందారు. రోడ్డుపై ఎలాంటి సూచిక బోర్డులు లేక పోవడమే ఈ ప్రమాదాలకు కారణమని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సూచిక బోర్డులను పెట్టి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరు..

వీరపునాయునిపల్లె, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాయసంపల్లె గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీ సుల కథనం మేరకు సికెదిన్నె మండలం తాడిగట్ల గ్రామానికి చెందిన ముంతా రవి (35), లేవనూరు నాని ద్విచక్రవాహనంపై సంతకొవ్వూరు గంగమ్మ దర్శనా నికి వెళ్తుండగా పాయసంపల్లె సమీపంలో మరో బైక్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ముంతా రవి అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన లేవనూరు నానిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు.



సంఘటన స్థలంలో పడి ఉన్న ద్విచక్రవాహనాలు

బైక్‌లను ఆటో ఢీకొనడంతో ఒకరు..

రాజంపేట టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఒక ఆటో ఒకదాని వెనుక ఒకటి వస్తున్న రెండు బైకులను ఢీకొనడంతో వెంకటరత్నం(52) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి కడపకు చెందిన ఎ.వెంకటరత్నం, నవీన్‌కుమార్ ఆదివారం పెనగలూరు మం డలం ఓబిలి గ్రామంలో అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తుండగా పట్టణంలోని బైపాస్‌లో ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట రత్నం మృతి చెందగా, నవీన్ కుమార్‌కు గాయాలయ్యాయి. అదే ఆటో వీరి వెనుకే వస్తున్న మరో బైక్‌ను సైతం ఢీకొంది. దీంతో ఆ బైకుపై ప్రయాణిస్తున్న రాజంపేట తహసీల్దారు కార్యాలయ ఉద్యోగి మణి, ఎల్.సుమలత గాయపడ్డారు. వీరిని తిరుపతికి తరలించారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజంపేట పట్టణ పోలీసులు తెలిపారు.



వెంకటరత్నం (ఫైల్ ఫొటో)

వడదెబ్బతో ఉపాధి కూలీ..

కమలాపురం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యో తి): వడదెబ్బ కారణంగా ఉపాధికూలీ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు మండల పరిధిలోని కొండాయపలెకు చెంది న చిట్టిబోయిన ఓబులేసు (53) శనివారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. పని పూర్తయిన అనంతరం ఇంటికి వస్తుండ గా వడదెబ్బకు గురయ్యాడు. వెంటనే బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుం బ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై ఏపీవో పార్థసారథి మాట్లాడుతూ ఓబులేసు ఉపాధి పనికి వచ్చిన మాట వాస్తవమేనని, మస్టరులో కూడా పేరు నమోదు చేశారని, అయితే మార్గమధ్యం లో వడదెబ్బ తగలడంతో శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారని తెలిపారు. డాక్టరు రిపోర్టు తీసుకుని ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

కారు ఢీకొని ఏఎస్‌ఐకి గాయాలు

చెన్నూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఏఎస్ఐ తీవ్రం గా గాయపడ్డాడు. సింహాద్రిపురం మండలంలో ఏఎస్ఐగా పని చేస్తున్న పి.సుధాకర్ ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంలో చెన్నూరుకు వస్తుండగా కొత్తరోడ్డు వద్ద కడప నుంచి ఖాజీపేట వైపు వెళుతున్న కారు వెనుకనుంచి ఢీకొంది. దీంతో గాయపడిన ఆయనను స్థానికులు కడపలోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నూరు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండులో చిన్నారి.. సంరక్షణకు ఎస్ఐ చర్యలు

పోరుమామిళ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో పలువురు పిల్లల కోసం హాస్పిటళ్ల చుట్టూ తిరిగి డబ్బులు ఖర్చు చేస్తున్నారు. కానీ కొందరు తమ పిల్లలే భారంగా భావించి ఎక్కడ పడితే అక్కడ వదిలేస్తున్నారు. అలాంటి సంఘటనే ఆదివారం పోరుమామిళ్లలో జరిగింది. స్థానిక ఆర్టీసీ బస్టాండులో తొమ్మిదినెలల చిన్నారిని ఎవరో వదిలేసి వెళ్లారు, ఎన్ని గంటలైనా ఎవరూ రాకపోవడంతో అక్కడి వారు ఎస్ఐ కొండారెడ్డికి సమాచారం అందించారు. వెంటనే ఆయన చిన్నారిని పోలీసుస్టేషన్‌కు తీసకువచ్చి విచారణ చేశారు. ఎటువంటి సమాచారం రాకపోవడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు అప్పజెప్పి, శిశు సంక్షేమశాఖలో చేర్చేందుకు చర్యలు తీసుకున్నారు.

48 ఎర్ర చందనం దుంగలు స్వాధీనం

- నలుగురు అరెస్ట్

తంబళ్లపల్లె, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 48 ఎర్రచందనం దుంగలు, ఓ ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేసినట్లు తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ చిరంజీవులు,, ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం, స్థానిక అటవీ శాఖ అధికారులు జయప్రసాదరావు, మోహన్‌రెడ్డి, షబీన్‌తాజ్ సహకారంతో బి. కొత్తకోట మండలం బురకాయలకోట అటవీ ప్రాంతంలోని వేపూరికోట ఫారెస్ట్ బీటు పరిధిలో ఆదివారం తెల్లవారుజామున తనిఖీలు చేస్తుండగా తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె సమీపంలోని వంక గట్టున ఓ ద్విచక్రవాహనం కనిపించింది. దీంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా, కొందరు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో తనిఖీ చేయగా, 48 ఎర్రచందనం దుంగలు లభించినట్లు తెలిపారు. పట్టుబడిన వారు ములకలచెరువు మండలం సోంపల్లెకు చెందిన సుధాకర్, రాజుగారిపల్లెకు చెందిన లక్ష్మీపతినాయుడు, పెద్దమండ్యం మండలం కురవపల్లెకు చెందిన మల్లికార్జున, గుర్రంకొండ మండలం మద్యాల్నాంవారిపల్లెకు చెందిన సురేంద్రరెడ్డిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడినవారితో పాటు, ఎర్రచందనం దుంగలు, ద్విచక్రవాహనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడిన ఎర్రచందనం దుంగలతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మహిళ విషయంలో రెండు గ్రామాల మధ్య ఘర్షణ

- పలువురికి తీవ్రగాయాలు

రామసముద్రం/మదనపల్లెటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత కుటుంబాన్ని వదిలి ప్రియుడితో కలసి వెళ్లిపోయి రెండు కుటుంబాలు, రెండు గ్రామాల మధ్య ఘర్షణకు కారణమైంది. శనివారం రాత్రి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కర్రలు, కత్తులతో దాడి చేసుకోవడంతో ఏడుగురు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే కమ్మవారిపల్లె పంచాయతీ బొర్రబోయనిపల్లెకు చెందిన ఓ వివాహిత పది రోజుల క్రితం తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఆర్.నడింపల్లె పంచాయతీ శ్రీరాములపల్లెకు చెందిన ఓ యువకుడితో వెళ్లిపోయింది. ఈ విషయమై ఎర్రబోయనపల్లెకి చెందిన గంగప్ప, శ్రీరాములపల్లికి చెందిన వెంకటప్ప కుటుంబాల మధ్య పదిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఎస్ఐ రవికుమార్ శనివారం రెండు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి రాజీ కుదిర్చి, గొడవపడకూడదని సర్ది చెప్పి, స్టేట్‌మెంట్ తీసుకుని పంపేశారు. ఆదివారం మళ్లీ ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో కర్రలు, కొడవళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో కమ్మవారిపల్లె పంచాయతీ ఎర్రబోయనపల్లెకి చెందిన మాజీ సర్పంచ్ కె.చిన్న వెంకటప్ప(67), కె.వెంకటరమణ(45), యశ్వంత్(25), సుధాకర్ (35), కె.గంగాధర్(30), విశ్వనాథ్ గాయపడగా ప్రత్యర్థి వర్గానికి చెందిన శ్రీరాములపల్లె వెంకటప్ప, అతని అనుచరులు కృష్ణమూర్తి, వెంకటరమణకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో కొందరు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో, కొందరు కోలార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం క్షతగాత్రులను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాష్ట్ర టీడీపీ యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు పరామర్శించారు. శ్రీరామ్ చినబాబు క్షతగాత్రులను రాష్ట్ర హోంమంత్రితో ఫోన్‌లో మాట్లాడించి అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉండగా మహిళ తండ్రి శాంతప్ప తనకు కొంత డబ్బు ఇవ్వాల్సి ఉందని, డబ్బు అడిగినందుకు తనపై దాడి చేశారని శ్రీరాములపల్లెకు చెందిన వెంకటప్ప ఆరోపిస్తున్నారు. మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి చేరుకుని ఘటనకు గల కారణాలను ఆరా తీసి, కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు రామసముద్రం ఎస్ఐ రవికుమార్ తెలిపారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

హార్సిలీహిల్స్‌లో సందడే.. సందడి



స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు



అందమైన లొకేషన్‌లో యువజంట ఫొటోషూట్

బి.కొత్తకోట, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాఊటీగా పేరుగాంచిన హార్సిలీహిల్స్‌లో ఆదివారం సందడి నెలకొంది. వేసవి సెలవులు ఈ వారంతో ముగియనుండటం, బక్రీద్ పండుగ మరుసటి రోజుతో పాటు, వారాంతం కావడంతో పలు వర్గాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో హిల్స్‌కు చేరుకున్నారు.దీంతో శనివారం రాత్రి ఏపీ టూరిజంకు చెందిన 57 అద్దె గదులూ భర్తీ కావడంతో పాటు, ప్రైవేటు రెస్టారెంట్లు, అతిథిగృహాల కిక్కిరిశాయి. ఆదివారం స్విమ్మింగ్‌పూల్‌లో సేదతీరుతూ, గాలిబండ, ఏరియల్ వ్యూ పాయింట్ నుంచి 4312 అడుగుల కిందనున్న ప్రకృతి అందాలను తిలకిస్తూ ఉల్లాసంగా గడిపారు. అటవీశాఖ ప్రాంగణంలోని జూపార్క్, మానస సరోవరంలో బోటింగ్ వద్ద పర్యాటకుల రద్దీ కనిపించింది. ప్రాంగణంలోని హార్సిలీహిల్స్ ఐకాన్‌తో పాటు, సుందరమైన లొకేషన్లలో పలు నూతన జంటలు ఫొటోషూట్‌లో పాల్గొనడం కనిపించింది. కొండపై ఎక్కడచూసినా జనసంచారం కనిపించింది.

'సీపీఎం కార్యకర్తలు సైద్ధాంతిక స్థాయిని పెంచుకోవాలి'

కడప సెవెన్ రోడ్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారీ సమాజంలో దోపిడీ, పెత్తందారుల దుర్మార్గాలు, అన్యాయాలను ప్రశ్నించాలంటే సైద్ధాంతిక, రాజకీయ, సామాజిక స్పృహ స్థాయిని తప్పనిసరిగా పెంచుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, సీనియర్ నాయకుడు దడాల సుబ్బారావు కార్యకర్తలకు సూచించారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో శాస్త్రీయ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనతా ప్రజాతంత్ర విప్లవ వ్యూహం, ఎత్తుగడలు, విప్లవ దశలు, పార్టీ కార్యక్రమం దశ, దిశలు వంటి వాటిపై పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని తెలిపారు. జమీందారులు, భూస్వాముల ఆర్థిక, సామాజిక, మానసిక దోపిడీలకు వ్యతిరేకంగా ఆనాడు పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించి, ప్రజాచైతన్యంతో తిరుగుబాటు చేసి లక్షలాది ఎకరాలు దున్నేవాడికి భూ పంపిణీ చేశారని తెలిపారు. పెట్టుబడిదారీ సమాజంలో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలు, మతోన్మాద శక్తులను ఎదుర్కోవాలంటే సీపీఎం కార్యకర్తలు ఉక్కు క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ వి.అన్వేష్, జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్, వి.మనోహర్, కె.శ్రీనివాసులరెడ్డి, బి.దస్తగిరిరెడ్డి, కె.సత్యనారాయణ, కె.శ్రీనివాసులు, కుమారస్వామిరెడ్డి, చంద్రారెడ్డి, శివరామ్, వెంకటేశ్వర్లు, వి.శివకుమార్, జి.సునీల్‌కుమార్, చిన్ని, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

దొంగ అరెస్టు: బంగారం స్వాధీనం

కడప క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని ఆదివారం కడప ఎయిర్‌పోర్టు వద్ద అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కడప మోచంపేటలోని చిలకలబావికి చెందిన షేక్ అక్బర్ ఆలీ ఎలక్ట్రీషియన్. క్రికెట్ బెట్టింగ్, జూదాలకు అలవాటుపడ్డాడు. వాటికి అవసరమయ్యే డబ్బుకోసం చోరీలు ప్రారంభించాడు. .ఈ నేపథ్యంలో కడప నగరంలోని వివిధ పోలీసుస్టేషన్‌లలో ఇతనిపై దాదాపు 20 కి పైగా కేసులు నమోదయ్యాయి. దొంగతనం కేసులో జైలుకు వెళ్లి తిరిగి వచ్చినా, చోరీలు మానుకోలేదు. ఇటీవల ఎన్జీవో కాలనీ, మృత్యుంజయకుంట, అక్కాయపల్లెలో చోరీ చేసిన బంగారు నగలు తీసుకుని పారిపోతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి అక్బర్ ఆలీని అరెస్టు చేసి, 40.160 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని రిమాండుకు తరలించినట్లు వివరించారు.

ఏరువమ్మ ఆలయంలో చోరీ

వీరబల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిగువరాచపల్లి పంచాయతీలో ఉన్న ఏరువమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ పూజారి నాగభూషణం కథనం మేరకు ఆదివారం ఉదయం ఆలయం తలుపులు తెరిచేసరికి అమ్మవారి వస్త్రాలు, ఆభరణాలు చిందరవందరగా పడి కనిపించాయి. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కాగా, ఆలయంలోని నగలు బంగారంతో చేసినవి కాదని భావించి అక్కడే పడేసి వెళ్లినట్లు పూజారి తెలిపారు. నిందితులను గుర్తించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గురిజాలలో గాలి వానకు నేలకొరిగిన అరటి

సింహాద్రిపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురిజాల గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం పెనుగాలులు, వానకు అరటిచెట్లు నేలకొరిగి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. గ్రామంలో రామ్మోహన్‌రెడ్డికి చెందిన 2500, చెన్నకేశవరెడ్డికి చెందిన 1000 , శ్రీధర్‌రెడ్డికి చెందిఇన 300అరటి చెట్లతోపాటు, సింహాద్రిపురంలో మరికొంతమంది కి చెందిన అరటిచెట్లు గాలికి పడిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాన్ని వేదపండితులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయాన్నే ఆలయంలో అర్చన, విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు స్వామి వారికి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, గోకుల్, వెంకీ, వరద, ఆలయ సిబ్బంది నాగరాజ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై లక్ష్మీనృసింహుడు



స్వామి వారి కల్యాణ దశ్యం

కలికిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన లక్ష్మీనరసింహ స్వామి వారికి ఆదివారం రాత్రి ఆలయంలో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజు సూర్యోదయాత్పూర్వమే స్వామికి అభిషేకాలు పూర్తి చేసి సర్వాలంకృతున్ని చేశారు. అనంతరం ఆలయంలో పల్లకి సేవ నిర్వహించారు. రాత్రి జరిగిన కల్యాణోత్సవంలో పట్టు వస్త్రాలు, రకరకాల ఆభరణాలతో అలంకృతుడై నవ వరుడుగా స్వామివారు పెళ్లి పీటలపై ఆశీనులయ్యారు. విశేషంగా హాజరైన భక్తులందరికీ తలంబ్రాలు అందజేశారు. అనంతరం కల్యాణ రూపుడైన నృసింహస్వామిని గరుడ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. ఈ తంతును ఆలయ ప్రధాన అర్చకుడు మురళీధర్ ఆచార్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

గోదాము డీటీ సుబ్రహ్మణ్యానికి ఘన సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన డీటీతో కుటుంబీకులు

మదనపల్లె, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సివిల్ సప్లయ్ గోదాము డీటీ సుబ్రహ్మణ్యంను ఘ నంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ సంద ర్భంగా స్థానిక పుంగనూ రు రోడ్డులోని ప్రైవేటు ఫం క్షన్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో రెవెన్యూ, సివిల్ సప్లయ్‌శాఖ, గోదాము హ మాలీలు పాల్గొన్నారు. విజ యభారతి స్కూల్ కర స్పాండెంట్ ఎన్.సేతు ముఖ్యఅతిథిగా మాట్లాడు తూ ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదని, అయితే తాను ఉద్యోగ బాధ్యతల్లో చేసిన సేవలే ఎప్పటికీ గుర్తుంటాయన్నారు. సుబ్రహ్మణం బి.కొత్తకోట, తంబళ్లపల్లె, కర్నూలులో పనిచేసి, మదనపల్లెలో ఉద్యోగ విరమణ చేసి నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, స్థానిక సీఎస్ డీటీ ఎస్.ఫిరోజ్‌ఖాన్, హెచ్ డీటీ బాజ్జి, మదనపల్లె, తంబళ్లపల్లె, బి.కొత్తకోట గోదాము పరిధిలోని రేషన్ డీలర్ల సంఘం నేతలు, రేషన్ డీలర్లు, హమాలీలు, రెవెన్యూ ఉద్యోగులు పెద్దసంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



దుర్యోధన వధ ఘట్టాన్ని తిలకిస్తున్న ప్రజలు

పీలేరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్టీసీ బస్టాండు సమీపంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం సాయంత్రం జరిగిన దుర్యోధన వధ ఘట్టం అందరినీ అలరించింది. దుర్యోధన వధ ఘట్టంలో భాగంగా దుర్యోధన, భీమ వేషధారులు మహాభారత ఘట్టాలను వివరించారు. కురుక్షేత్ర యుద్ధంలో కౌరవులందరూ మరణించిన తరువాత చివరగా మిగిలిన దుర్యోధనుడు నీటిమడుగులో దాక్కుని శివుడి గురించి తపస్సు చేస్తుండగా అతడిని భీముడు బయటకు రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది. ఆ సందర్భంగా పాత్రదారులు రాగయుక్తంగా పలు పద్యాలు ఆలపించి ఆకట్టుకున్నారు. ఇరువురూ వీరోచితంగా పోరాడగా చివరగా దుర్యోధనుడి తొడను భీముడు విరచడంతో మహాభారత యుద్ధం ముగిసింది. అనంతరం రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు.

మళ్లీ తెరపైకి తోపుపొరంబోకు భూమి వివాదం

- దున్నకాన్ని అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

బి.కొత్తకోట, జూన్8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గట్టు గ్రామంలో వివాదాస్పదంగా వున్న తోపుపొరంబోకు వ్యవహారం ఆదివారం మరోసారి తెరమీదకు వచ్చింది. రెవెన్యూ అధికారులు పేర్కొన్న సమాచారం మేరకు... గట్టులో సర్వేనంబరు 1117 లో 4.53 ఎకరాల భూమి గ్రామానికి చెందిన ఓరైతు స్వాధీనంలో వుంది. ఆ భూమిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలంటూ గతంలో కలెక్టర్‌కు పీజీఆర్ఎస్ ఫిర్యాదు వెళ్లడంతో రెవెన్యూ అధికారులు వెళ్లి అది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు నాటారు. అంతలో సంబంధిత రైతు వచ్చి తనకు కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను చూపించాడు. ఆ భూమిపై స్టేటస్‌కో(యథాతథస్థితి) వుందని ఎవరూ ప్రవేశించరాదని చెప్పి అధికారులు వెనుదిరిగారు. అయితే తాజాగా ఆదివారం ఆ తోపుపోరంబోకు స్థలం దున్నుతున్నారని గ్రామస్తులు కొందరు రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో మండల అధికారుల ఆదేశాల మేరకు స్థానిక సిబ్బంది వెళ్లి దున్నకాన్ని ఆపించారు. ఈ విషయమై తదుపరి కార్యాచరణ నిబంధనల మేరకు ఉంటుందని ఆర్ఐ వీరాంజనేయులు తెలిపారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

సిద్దవటం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మాధవరం-1 పంచాయతీ ఎస్కేఆర్ ఎస్సీ కాలనిలో వెలసిన అంకాలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా ఆదివారం వృషభరాజుల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.50 వేలు వైఎస్ఆర్ జిల్లా చాపాడు మండలం రాజువారిపేట వాసి లింగారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఎద్దులు గెలుపొందాయి. రెండో బహుమతి రూ.30 వేలు కడప రూపవారిపల్లెకు చెందిన బొజ్జా విద్యుఓబుల్‌రెడ్డి, ఎద్దులు, మూడో బహుమతి రూ.20 వేలు బద్వేలు మండలం కుమ్మరి కొట్టాలకు చెందిన మినుకొండ రఫీ, వల్లూరు మండలం శీతోరుపల్లెకు చెందిన చందా ప్రణీత్‌కుమార్‌రెడ్డి ఎద్దులు సంయుక్తంగా సాధించాయి. నాలుగో బహుమతి అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం వరదాయపల్లె గ్రామానికి చెందిన దత్త శ్రీరాములు ఎద్దులు రూ.15 వేలు గెలుచుకున్నాయి. కాగా మొదటి బహుమతి రాజంపేట పార్లమెంట్ జనసేన సమన్వయకర్త అతికారి కృష్ణ, రెండో బహుమతిని ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య, మూడో బహుమతి టీడీపీ పార్లమెంట్ వాణిజ్య అధికార ప్రతినిధి చలపాటి చంద్ర, నాలుగో బహుమతిని జనసేన యువ నేత డేరంగుల శ్రీకాంత్‌లు అమ్మవారి గుడి వద్ద అందజేశారు.

పీలేరులో దొంగలు పడ్డారు

- కొనసాగుతున్న చోరీల పరంపర
- ముందుకు సాగని దర్యాప్తు
- సంత కేంద్రంగా సెల్‌ఫోన్ల చోరీలు
- ఆదమరిస్తే వాహనాలూ అంతే



వీవర్స్ కాలనీలో చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న దృశ్యం. (ఫైల్ ఫొటోలు)

పీలేరు రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంతరించుకుంటున్న పట్టణంలో దొంగలు పడ్డారు. పట్టణ విస్తరణకు అనుగుణంగా పోలీసుల నిఘా, పర్యవేక్షణ లేకపోవడంతో చోరీల పరంపర కొనసాగుతోంది. కొంతకాలంగా పట్టణంలో తాళం వేసిన ఇళ్లు, ఇళ్లముందు, ప్రధాన కూడళ్లలో పార్క్ చేసిన ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్ల దొంగతనానికి గురవుతున్నాయి. చోరీలపై పోలీసులను సంప్రదించినా సరైన స్పందన లేదని బాధితులు లబోదిబోమంటున్నారు. మరోవైపు పోలీస్, ప్రైవేట్ సీసీ కెమెరాల ఫుటేజ్‌తో సత్ఫలితాలు అందుకోలేక పోతున్నారు. ఓవరాల్‌గా చోరీలపై పోలీస్ దర్యాప్తు ముందుకు సాగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రిళ్లు పట్టణ శివారు ప్రాంతీయులు బిక్కుబిక్కుమంటున్నారు. రాత్రిళ్లు పోలీస్ గస్తీని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చోరీలు జరిగిన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఫుటేజ్ సేకరించినా దొంగలను పట్టుకోవడంలో జాప్యం చోటుచేసుకుంటోందని ఆరోపణలు ఉన్నాయి.

పీలేరు పట్టణ శివారు ప్రాంతం తిరుపతి మార్గంలోని వీవర్స్ కాలనీలో రెండు ఇళ్లల్లో దొంగలు పడి లక్షలాది రూపాయల విలువైన బంగారు, వెండి, నగదు దోచుకెల్లారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టేషన్‌కు ఎదురుగా ఉన్న చెన్నారెడ్డి వీధి వాసి శ్రీనివాసులు రెడ్డి ఇంట్లో బంగారు, నగదు దోచుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే పీలేరు ఆర్టీసీ బస్టేషన్ ఆవరణలో ప్రయాణీకుల సెల్‌ఫోన్ల చోరీల పరంపర కొనసాగుతోంది. ప్రతి మంగళవారం ఆర్టీసీ బస్టేషన్ సమీపంలో జరిగే వారపు సంతకు పట్టణ ప్రజలు, చుట్టుపక్కల మండలాలు, గ్రామాలకు చెందిన వేలాది మంది వచ్చి వెళుతుంటారు. దీంతో వారపు సంత సెల్‌ఫోన్ల చోరీకి కేంద్ర బిందువుగా మారింది. ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు సంతకు వచ్చి సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న సంఘటనలు అనేకం. ఇంటి ముందు, ప్రధాన కూడళ్లు, ఆర్టీసీ బస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేసి పనులు ముగించుకుని వచ్చేలోపే చోరీకి గురవుతున్నాయి.

తాజాగా ద్విచక్రవాహనం చోరీ...

పులిచెర్ల మండలం పుచ్చలవారిపల్లెకు చెందిన ఎ. మునిప్రసాద్ ఆర్టీసీ బస్టేషన్ ఆవరణలో ఉన్న రొమాంటిక్ హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తాడు. శుక్రవారం ఉదయం విధులకు హాజరై హోటల్ వద్ద ద్విచక్రవాహనాన్ని పార్క్ చేశాడు. మధ్యాహ్నం డ్యూటీ ముగించుకుని వచ్చేలోపే ద్విచక్రవాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. చోరీపై సీసీటీవీ ఫుటేజ్‌లో దిచక్రవాహనాన్ని దొంగ ఎత్తుకెళ్లినట్లు రికార్డ్ అయింది. పీలేరు మండలం ఆవులయ్యగారిపల్లె వాసిదిచక్రవాహనంపై వారపు సంతకు వచ్చాడు. సంతలో కూరగాయలు తీసుకుని వచ్చేలోపే దొంగలు వాహనాన్ని ఎత్తుకెళ్లారు. ఇలా నిత్యం చోరీలు జరుగుతూనే ఉన్నాయి. బాధితులు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు దొంగలు ఎత్తుకెళ్లారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని ఆరోపణలు తరుచూ వినిపిస్తూనే ఉన్నాయి.

పట్టణంలో ప్రధాన కూడళ్లు సహా పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయినా చోరీల విజజంలో సీసీ కెమెరాల పుటేజ్ ఆధారంగా చేపట్టే పోలీస్ దర్యాప్తు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదనే విమర్శలున్నాయి. సీసీ కెమెరాల్లో దొంగల కదలికలు రికార్డు అయినా సత్ఫలితాలు రావడంలేదని బాధితులు వాపోతున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం : ఎస్ఐ లోకేష్

చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఇటీవల జరిగిన చోరీల్లో కొంత సొత్తు రికవరీ చేశాం. దిచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు చోరీ జరిగితే సత్వర చర్యలు తీసుకుంటున్నాం. పట్టణంలో ఇప్పటికే 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. అనుమానిత వ్యక్తులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాం. వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలి. రాత్రి గస్తీ పటిష్టం చేశాం.



చోరీకి గురైన ద్విచక్ర వాహనం

విత్తనాల కోసం నమోదు చేసుకోండి

రామసముద్రం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వేరుశనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో నేటి నుంచి నమోదు చేయించుకోవాలని ఏఓ మోహన్‌కుమార్ ప్రకటించారు. రామసముద్రం మండల రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, ఓటీపీ కోసం ఫోన్ తెచ్చుకుని బయోమెట్రిక్ వేసి విత్తనాల డబ్బు ముందుగానే చెల్లించి నమోదు చేయించుకోవాలన్నారు. మండలానికి 1060క్వింటాళ్ల కేటాయించారని ముందుగా డబ్బు చెల్లించి నమోదు చేయించుకున్న వారికి మాత్రమే పంపిణీ చేస్తామన్నారు. నమోదు పూర్తి అయిన తరువాత ప్రభుత్వం నిర్ణయించిన తేదీల్లో పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. విత్తనాలు కొన్న రైతులు తప్పనిసరిగా తమ పొలంలో వేసుకుని ఆన్‌లైన్‌లో పంట నమోదు చేయించుకోవాలన్నారు. వేరుశనగ పూర్తి ధర రూ.2,790 ఇందులో రాయితీపోను రైతు వాటా రూ.1,674 చెల్లించాలని ఏఓ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

120 మందికి రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు



బ్లడ్ గ్రూప్ కోసం రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

పెద్దమండ్యం, జూన్ 8(ఆంధ్రజ్యోతి) ప్రతి ఒక్కరూ తమ బ్లడ్ గ్రూప్‌ను తెలుసుకోవాలని మదనపల్లి హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్ధిక్ పిలుపు నిచ్చారు. పెద్దమండ్యంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో వైద్య నిపుణులచే ఉచిత బ్లడ్ పరీక్షలు నిర్వహించి వారి బ్లడ్ గ్రూప్ వివరాల పత్రాలను అందజేశారు. 120 మందికి ఉచితంగా బ్లడ్‌గ్రూప్ నిర్ధారించారు. కార్యక్రమంలో మదనపల్లి వాలంటరీ బ్లడ్ బ్యాంక్ అధికారి బాలచంద్రనాయుడు, సంస్థ సభ్యులు కిరణ్, చైతు, చరణ్, నగేష్, మహబూబ్, సున్ని పాల్గొన్నారు.

అనారోగ్యంతో జవాన్ మృతి

రామసముద్రం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలవానెల్లూరు పంచాయతీ పిలిగుండ్లపల్లెకు చెందిన జవాన్ మురళి(38) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఇతను 15ఏళ్లుగా జవాన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అండమాన్ నికోబార్ దీవుల్లో విధులు నిర్వర్తిస్తుండగా 20రోజుల కిందట కాలికి గాయమై అది తీవ్రతరం కాగా చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చెన్నై నుంచి పిలిగుండ్లపల్లెకు మురళి మృతదేహాన్ని తెచ్చి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా మురళికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

యోగాంధ్రలో పాల్గొనాలి

బి.కొత్తకోట, జూన్8 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు నేడు బి.కొత్తకోట మండలం గట్టు గ్రామ జడ్పీహైస్కూల్ గ్రౌండ్‌లో 2025యోగా శిక్షణను విజయవంతం చేయాలని ఎంపీడీఓ క్రిష్ణవేణి కోరారు. మండలంలోని హౌసింగ్, ఇంజనీరింగ్, వైద్యం, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, వెలుగు, తదితర శాఖల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది ఉదయం 6 గంటలకే హాజరు కావాలన్నారు.

ముగిసిన హజ్‌యాత్ర

మదనపల్లె, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి హజ్‌యాత్రకు వెళ్లిన ముస్లింల యాత్ర ముగిసిందని హజ్ రాష్ట్రకమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం నుంచి 243 మంది 20రోజుల కిందట హైదరాబాద్ నుంచి బయలు దేరారని, వారంతా పవిత్ర యాత్రను పూర్తి చేసుకున్నట్లు తెలిపారు.

గోవధపై సబ్‌కలెక్టరేట్ ఎదుట నిరసన

నలుగురు బీజేపీ నేతల అరెస్టు

మదనపల్లె టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో కొందరు గోవధ చేశారని ఆదివారం రాత్రి బీజేపీ నేతలు సబ్‌కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. బీజేపీ నేతలు బండి ఆనంద్, నారదరెడ్డి, భగవాన్, మోహన్‌రాజ్ మాట్లాడుతూ గోవధ నిషేధం అయినా, కొందరు ఆరోగ్యవరం వద్ద గోవధ చేసేందుకు ప్రయత్నించారని, ఇది ముమ్మాటికీ పోలీసుల వైఫల్యమే అన్నారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు బీజేపీ నేతలను అరెస్టు చేసి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. కాగా మదనపల్లె మండలం టిడ్కో ఇళ్ల వద్ద తాలూకా పోలీసులు వెళ్లగా అక్కడ నాలుగు జెర్సీ ఆవులు, ఆరు కోడెదూడలు, ఒక నాటు ఆవు వుండడంతో వాటిని గోశాలకు తరలించి పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె తాలూకా సీఐ వెంకటరమణ తెలిపారు.

ఆపన్నులను ఆదుకునేందుకే సీఎంఆర్‌ఎఫ్



లబ్దిదారుడికి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలను ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు మంజూరు చేయిస్తున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె మండలం, పట్టణంలోని 14 మందికి రూ.9లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆర్కే రామకృష్ణాచారి, ఎస్ఏ మస్తాన్, నస్రీన్‌తాజ్, దాదాపీర్, నవీన్ పాల్గొన్నారు.



కాలువపల్లె మార్గం నరకప్రాయం

ప్రయాణం సాహసమే...! ● కంకర తేలి గోతులు పడిన రోడ్లు ● రాకపోకలు సాగించాలంటే హడల్

ములకలచెరువు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): 'సాహసం చేయరా డింభకా రాజకుమారి వరిస్తుంది' అంటూ పాత సినిమా డైలాగ్ గుర్తుకొస్తోంది కాలువపల్లె రోడ్డు చూస్తుంటే. కాలువపల్లెకు చేరాలంటే సాహసంతో కూడిన ప్రయాణం చేయాల్సివస్తోంది. కంకర తేలి రోడ్లన్నీ గోతులు పడ్డాయి. వాహనదారులు రాకపోకలు సాగించడానికి హడలెత్తిపోతున్నారు. గూడుపల్లె క్రాస్ నుంచి కాలువపల్లెకు, చౌడసముద్రం నుంచి కాలువపల్లెకు వెళ్లే రోడ్లు దారుణంగా తయారవడంతో పది కిలోమీటర్ల దూరం వెళ్లాలంటే ప్రజలకు చుక్కలు కన్పిస్తున్నాయి. ద్విచక్రవాహనదారులు, ఆటోలు సైతం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. వైసీపీ ప్రభుత్వం రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని జగమెరిగిన సత్యం.

ములకలచెరువు మండలం గూడుపల్లె క్రాస్ నుంచి కాలువపల్లె వరకు 10 కిలో మీటర్లు రోడ్డు ఉంది. ఈ రోడ్డులో గూడుపల్లె క్రాస్, కోటపల్లె, గూడుపల్లె, బుద్దలవారిపల్లె, కాలువపల్లె గ్రామాలున్నాయి. కాలువపల్లె నుంచి చౌడసముద్రానికి ఎనిమిది కిలో మీటర్ల దూరం. ఈ రోడ్డులో కాలువపల్లె, పెద్దపల్లె, గుత్తావారిపల్లె తండా, గుత్తావారిపల్లె, కనికలతండా, రెడ్డివారిపల్లె, చౌడసముద్రం గ్రామాలున్నాయి. ఈ రెండు రోడ్లలో గూడుపల్లె, కాలువపల్లె, చౌడసముద్రం పంచాయతీలకు చెందిన సుమారు 25 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్లపై ఏర్పడ్డ గుంతలకు కొన్నేళ్లగా మరమ్మతులు చేపట్టకపోవడంతో దారుణంగా తయారయ్యాయి. అడుగడుగునా రోడ్లు మొత్తం భారీగా గుంతలు ఏర్పడి కంకరతేలిపోయి దుస్థితికి చేరాయి. రైతులు తాము పండించిన టమోటాలు మార్కెట్‌కు తీసుకురావాలన్నా ఇబ్బందులు తప్పట్లేదు. బైక్‌లు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల కారణంగా ద్విచక్రవాహనాలు అదుపు తప్పి బోల్తాపడి ప్రమాదాలకు గురవుతున్నారు. గర్భిణులు, అనారోగ్యానికి గురైన వారిని తీసుకెళ్లేందుకు 108 వాహనం గ్రామాలకు రావాలన్నా గంటల సమయం అవుతోంది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా చొరవతీసుకుని గూడుపల్లె క్రాస్ - కాలువపల్లె, కాలువపల్లె - చౌడసముద్రం రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి బోరు రిపేరు చేయించరా..?



బోరు వద్ద నిరసన తెలుపుతున్న తమటంవారిపల్లె దళితవాడ వాసులు

రాయచోటి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల నుంచీ తాగునీటి ఇబ్బందులు పడుతున్నామని, కనీసం బోరు మోటారు రిపేరు చేయించమని అధికారులను తమటంవారిపల్లె దళితులు అడుగుతున్నారు. రాయచోటి మండలం మాధవరం గ్రామం తమటంవారిపల్లె దళితవాడలో దళితులు తాగు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. తాగునీటి బోరు, మోటారు కాలినెల రోజులవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆదివారం దళితులు బోరు వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కొత్తగా బోరు వేయమని అడగలేదని, వెలిగల్లు ప్రాజెక్టు నుంచి పైపులైన్ వేయమని అడగలేదన్నారు. కేవలం కాలిపోయిన బోరు, మోటారును రిపేరు చేయించమని బతిమాలినా కనికరం చూపడం లేదని వాపోతున్నారు. గతంలో ఇదే బోరు మోటారు కాలిపోతే చందాలు వేసుకుని రిపేరు చేయించుకున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటారు రిపేరు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వీహెచ్‌పీ సత్సంగ జిల్లా అధ్యక్షుడిగా వెంకటరెడ్డి



దరిశా వెంకటరెడ్డి

రైల్వేకోడూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ సత్సంగ జిల్లా అధ్యక్షుడిగా రైల్వేకోడూరుకు చెందిన దరిశా వెంకటరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లెలో నిర్వహిం చిన వీహెచ్‌పీ కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఓబులవారిపల్లె మండలం మంగంపేట కాపుపల్లె వాసి పులపుత్తూరి సుదర్శన్‌రెడ్డిని ప్రఖండ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఓబులవారిపల్లె మండల ప్రఖండ అధ్యక్షుడిగా గల్లా ధనుంజయ్‌ను ఎన్నుకున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



మంగళసూత్రాన్ని చూపుతున్న పండితులు

నందలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అరవపల్లెలోని కోదండరామ స్వామి పునఃప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సీతారాముల వారి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు, జడ్పీటీసీ శివరామరాజు, సర్పంచ్ సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా రేణుకా యల్లమ్మకు పూజలు

సిద్దవటం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మాచుపల్లెలో రేణుకా యల్లమ్మకు ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. సిద్దవటంవాసి అక్కిశెట్టి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. బండారు రాజగోపాలయ్య దంపతులు, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, ఏపీ పంచాయతీ రాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ

పెనగలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారి ఊంజల్ సేవను శక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, వరలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ధర్మకర్త, మాజీ ధర్మకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మారమ్మతల్లి జాతర

నందలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపల్లెలో వెలసిన మారమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలు బోనాలను సమర్పించారు. జనసేనపార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.